

రేపటి నుంచి శిక్షణ

జిల్లాలోని ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి మూడు విడతలుగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. 8లో



'ఉద్దీపకం'తో సత్ఫలితాలు

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ప్రాథమిక విద్య పటిష్టతకు చేపట్టిన 'ఉద్దీపకం' ప్రయోగం ఫలించింది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం/ఖమ్మంవన్‌టౌన్ : రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో సీసీ రోడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు. 11 గంటలకు ఎర్రగడ్డ, 11.30 గంటలకు మేడిదపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి, మధ్యాహ్నం 12 గంటలకు గోపాయిగూడెంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 1.30 గంటలకు కూసుమంచి క్యాంపు ఆఫీస్ నుంచి ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లాకు వెళతారు.

రేపు పాలిసెట్

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ – 2025 ఈనెల 13న జరగనుందని పాలిసెట్ కో ఆర్డినేటర్, ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో 800 మంది, ఎస్‌బీఐటీలో 500, కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 500, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాలలో 500, డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో 504 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. ఎండల తీవ్రత దృష్ట్యా దూర ప్రాంత విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్, ఆధార్ కార్డుతో పాటు, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ/బ్లాక్ పెన్ తీసుకురావాలని తెలిపారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు



ఖమ్మంవ్యవసాయం: గత వారం ఉపరితల ద్రోణి కారణంగా తగ్గిన ఉష్ణోగ్రతలు క్రమంగా మళ్లీ పెరుగుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ 11 గంటల వరకు తీవ్ర రూపం దాల్చుతోంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. పలు రంగాల్లో పనిచేస్తున్న వారు ఉదయం 7 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటల వరకే ముగిస్తుండగా కొందరు ఉదయం, సాయింత్రం వేళల్లో పనులు చేస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాణాపురంలో 42.8 డిగ్రీలు, పమ్మిలో 42.7, పెనుబల్లిలో 42.6, కూసుమంచిలో 42.4, చింతకానిలో 42.1, నేలకొండపల్లిలో 42, గౌరారం, వైరా ఏఆర్‌ఎస్‌లో 41.7, తల్లాడ, గేటు కారేపల్లి, తిరుమలాయపాలెం, వైరా, కుర్నవల్లి, లింగాలలో 41.4, కల్లూరు 41.3, ఖమ్మం ప్రకాశ్‌నగర్, ముదిగొండలో 40.9, ఎర్రుపాలెం, పల్లెగూడెంలో 40.8, ఖమ్మం ఖానాపురం, వేంసూరులో 40.6, రఘునాథపాలెంలో 40.5, కాకరవాయి, కొణిజర్లలో 40.2, బచ్చోడులో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యల్పంగా సత్తుపల్లిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు, ఉక్కపోతకు తోడు అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్య కల్యాణ వేడుక ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 406 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.22,885 ఆదాయం లభించింది.



ముగింపు దశకు చేరుకున్న భవనం పనులు

● లేజర్ కటింగ్ మిషన్

ఆర్టిజమ్‌లో ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్.. లేజర్ కటింగ్ మిషన్‌పై విద్యార్థులకు బోధిస్తారు. వివిధ హస్తకళలు, ట్రేడ్‌లలో క్లిష్టమైన డిజైన్‌లు, ఎన్‌గ్రేవింగ్, రాళ్లు, చెక్క, అద్దాలపై పేర్లు, ఫొటోలు, వివిధ రకాల బొమ్మలు ప్రింట్ చేయడం నేర్పిస్తారు. అలాగే ఆటోమొబైల్ కట్ సెక్షన్‌లో ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ వర్కింగ్ నేర్పించడం, ఐసీ ఇంజన్ కాంపోనెంట్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఆటోమొబైల్ ప్రతి కాంపోనెంట్ గురించి నేర్పిస్తారు.

ఏటీసీ.. అంతా రెడీ!

త్వరలో అందుబాటులోకి నూతన భవనం

- ఇప్పటికే అడ్వాన్స్ కోర్సుల పరికరాలు సిద్ధం
- కొత్తగా ఆరు కోర్సుల్లో బోధనకు అవకాశం



విడిభాగాలతో వాహనాలు రూపొందించేందుకు ఉపయోగపడే పరికరాలు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థులకు మరింత ఉపయుక్తమైన కోర్సులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని ఐటీఐల్లో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోర్సు)లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా టేకులపల్లి ఐటీఐలో ఏటీసీ ఏర్పాటుతోపాటు నూతన భవనాన్ని మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా.. కొత్తగా ప్రవేశపెడుతున్న కోర్సులకు సంబంధించిన పరికరాలు అమరుస్తున్నారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో కళాశాల భవన నిర్మాణానికి రూ.4.77కోట్లు కేటాయించారు. ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఐఐసీ)ద్వారా పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు.

అడ్వాన్స్ కోర్సుల కోసం..

రాష్ట్రంలో మొత్తం 65 ప్రభుత్వ ఐటీఐలు ఉండగా.. వాటిని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైలట్ ప్రాజెక్టుగా తొలిదశలో హైదరాబాద్‌లోని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ, నిజామాబాద్ ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం జిల్లాలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసింది. ఈ కోర్సులు ప్రవేశపెట్టడంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు కానున్నాయి. గతంలో 8 కోర్సులు ఉండగా.. ఏటీసీ ద్వారా కొత్తగా ఆరు కోర్సులు వచ్చాయి. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

కొత్త కోర్సులకు రంగం సిద్ధం..

నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీలో మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సులు ప్రవేశపెట్టారు. ఈ కోర్సులను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయి. ఈ కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్స్ కోసం అవసరమైన పరికరాలను భవనంలో అమరుస్తున్నారు. దాదాపు ఏడు మిషనరీలను ఇక్కడ అమర్చారు. వీటి ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందనుంది. ఇదిలా ఉండగా ఈ నెలాఖరు వరకు భవనం పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అండ్ సిమ్యులేటర్

మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్‌లో ఇండస్ట్రియల్ ఆటోమేషన్, సిమ్యులేటర్ తీరును వివరిస్తారు. పీఎల్‌సీ ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పిస్తారు. పవర్‌ప్లాంట్ ఆపరేషన్ కంట్రోలింగ్, క్వాలిటీ, ప్రాసెస్ కంట్రోల్, న్యూమాటిక్స్, హైడ్రాలిక్స్, మెషిన్ ఆపరేషన్ కంట్రోలర్‌పైనా వివరిస్తారు. ఇండస్ట్రియల్ రోబోటిక్స్‌లో అడ్వాన్స్ వెల్డింగ్, టిగ్ వెల్డింగ్, మిగ్ వెల్డింగ్, ఏఆర్‌సీ, గ్యాస్ వెల్డింగ్‌తో పాటు రోబోలను వాడుకుని వస్తువులను షిఫ్ట్ చేయడం వంటివి నేర్పిస్తారు.

మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్..

ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిజమ్ నేర్పిస్తారు. బ్యాటరీ నిర్వహణ, ట్రబుల్ షూటింగ్, వెహికిల్ సర్వీసింగ్, అసెంబుల్ ఎలక్ట్రిక్ వెహికిల్ కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వెహికిల్ రిపేరింగ్‌పై శిక్షణ ఇస్తారు.

● సీఎన్‌సీ, వీఎంసీ మిషన్

మొదటగా సీఎన్‌సీ, వీఎంసీ మిషన్ ఏర్పాటు చేశారు. ఈ మిషన్‌పై గౌర్ కటింగ్, నట్, బోల్ట్ తయారీ, మెటల్ కటింగ్, ట్రిమ్మింగ్, టర్నింగ్, ఫేసింగ్, క్రాఫ్ట్, హస్తకళలు, శిల్పం, నమూనా, సీఏడీ సాఫ్ట్‌వేర్ డిజైనింగ్ తదితర వాటిని నేర్పిస్తారు.



ఉద్యోగావకాశాలు సులువు



రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయటం ద్వారా ఆరు కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త కోర్సుల ద్వారా నూతన టెక్నాలజీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులభంగా లభించనున్నాయి. కోర్సులు, ట్రెనింగ్ పూర్తయిన వారికి టాటా గ్రూప్ వారే వారి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. దీని ద్వారా అనేక మంది విద్యార్థులకు ఉపాధి లభిస్తుంది.

– ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ఐటీఐ, ఖమ్మం

వైభవంగా నృసింహ జయంతి



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

- జయజయధ్వానాల నడుమ స్వామివారి గిరి ప్రదక్షిణ
- నక్షత్ర జ్యోతి దర్శనానికి పోటెత్తిన భక్తులు



నక్షత్ర జ్యోతిని వెలిగిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో స్వాతి నక్షత్రం సందర్భంగా ఆదివారం స్వామివారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈఓ కొత్తూరు జగన్మోహన్ రావు పర్యవేక్షణలో తెల్లవారుజామున 5:30 గంటల నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయ యుతంగా సుదర్శన యాగం చేశారు.

నయనానందకరంగా గిరి ప్రదక్షిణ..

భక్తజన సందోహం నడుమ ఖమ్మం నడిబొడ్డున ఉన్న స్తంభాద్రి గుట్ట చుట్టూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో నిర్వహించిన గిరి ప్రదక్షిణ నయనానందకరంగా సాగింది. పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తూ గిరి ప్రదక్షణ చేశారు. అనంతరం గుట్టపై ఆలయం పక్కన నక్షత్ర జ్యోతి(దివ్య జ్యోతి)ని అర్చకులు వెలిగించగా దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆ సమయాన భక్తుల నృసింహ నామ స్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది.

ఉద్యమకారులు అధైర్యపడొద్దు

టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్ పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం : జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ అధైర్యపడొద్దని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ సదస్సులో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చెప్పిన మోసపూరిత మాటల వల్లే నేడు ఆయన ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందన్నారు. కొట్లాడి సాధించిన రాష్ట్రంలో అసలైన ఉద్యమకారులను నేడు వెనక్కు నెట్టేశారని విమర్శించారు. ఎంతోమంది విద్యార్థులు, ప్రజల ఆత్మబలిదానాలతో సాధించిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే పెత్తనం చేసిందని అన్నారు. తనకు ప్రస్తుత ప్రభుత్వంలో అయినా కాస్త గుర్తింపు రావడంతో ఉద్యమకారుల పక్షాన శాసనమండలిలో మాట్లాడగలుతున్నామని చెప్పారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ దక్కిందన్నారు. సదస్సులో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, పల్లె వినయ్‌కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి. కృష్ణారావు, నాయకులు పసుపులేటి నరసయ్య, మహబూబ్ బాషా, ప్రసాద్, అక్బర్, డేవిడ్, సయ్యద్ సలీంపాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా మధిర నియోజకవర్గానికి చెందిన షేక్ సర్దార్ హుస్సేన్‌ను నియమిస్తున్నట్లు కోదండరామ్ ప్రకటించారు.

మీటర్ రీడింగ్ కార్మికుల వినతి..

రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు కోదండరామ్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో సుమారు 2వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, విద్యుత్ సంస్థకు ఆదాయం సమకూరుస్తున్న తమకు సరైన న్యాయం జరగడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. పీస్‌రేట్ పద్ధతి కాకుండా నెలవారీ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. నాయకులు వేమూరి వీరయ్య, నాగేశ్వరావు, అనిల్, మల్లేశ్వరరావు, వంశీ, నాగార్జున, బాలు, నరేష్, నవీన్, మధు పాల్గొన్నారు.

వేసవిలో పక్షులకు నీరందించాలి

సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్



సైకిల్ ర్యాలీలో సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ తదితరులు

ఖమ్మంవన్‌టౌన్ : వేసవి కాలంలో పక్షులకు నీరందించేందుకు జిల్లా అటవీ శాఖ వినూత్న ప్రయత్నం చేస్తోంది. 'ఏ బౌల్ ఆఫ్ వాటర్.. సేవ్ వింగ్స్' నినాదంతో పాటు సేవ్ ఫారెస్ట్–సేవ్ నేషన్, సేవ్ వాటర్–సేవ్ ప్లాంట్ వంటి పర్యావరణ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆదివారం ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ నుంచి వెలుగు మట్ల అర్బన్ పార్కు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీ సునీల్ దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ.. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. కాగా, ర్యాలీలో పాల్గొన్న సైకిల్ రైడర్లు.. పక్షులకు నీరందించే మట్టిగిన్నెలు కొనుగోలు చేసి అటవీ శాఖ సిబ్బందికి అందజేశారు. అంతేకాక ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వన విజ్ఞాన్ సమ్మర్ క్యాంప్‌లో మొక్కల పెంపకం, ట్రెక్కింగ్, పర్యావరణ అవగాహన, సైక్లింగ్, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హాజరైన విద్యార్థులకు సీపీ,, డీఎఫ్‌ఓ, ఇతర సిబ్బంది ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గోవిందాపురం(ఎల్), కలకోట గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూములపై రైతులకు జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ చట్టం ఉపకరిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్‌లో మార్పులు, చేర్పులు వంటి సేవలను భూభారతి చట్టంలో పొందుపర్చారని వివరించారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని, పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని తెలిపారు. భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు చేయొచ్చని చెప్పారు. రైతులు తమకు న్యాయం జరగలేదని భావిస్తే రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చినా వాటిని తొలగించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం ఉంటుందని అన్నారు. కాగా, భూ సమస్యల పరిష్కారానికి కలకోటలో 125, గోవిందాపురంలో 69 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాంబాబు, ఆర్‌ఐలు నవీన్, మైథిలీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

- జిల్లాలో మూడు విడతలుగా శిబిరాలు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని ఉపాధ్యాయులకు మూడు విడతలుగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈఓ సామినేని సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడత శిక్షణ మంగళవారం నుంచి ఈనెల 17 వరకు, రెండో విడత 20 నుంచి, మూడో విడత 27 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎస్ఏ ఇంగ్లిష్ టీచర్లు 326 మంది, గణితం 453, సోషల్ ఉపాధ్యాయులు 436 మంది, మండల రిసోర్స్ పర్సన్లు 168 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఐఆర్పీలు 62 మందికి ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కాగా, కోర్సుల కో ఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లతో సోమవారం సంసిద్ధత సమావేశం ఏర్పాట్లు చేశామని తెలిపారు.

శిక్షణ తరగతులకు ఎంపికైన ఉపాధ్యాయులంతా ఉదయం 9.30 గంటల లోపు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా జియోట్యాగ్డ్ హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. వర్కింగ్ లంచ్, టిఫిన్, టీ శిక్షణ కేంద్రంలోనే అందజేస్తారని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకుని సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బోధించనున్న అంశాలివే..

ఐదు రోజుల శిక్షణ తరగతుల్లో కంటెంట్ ఎన్‌రిచ్‌మెంట్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ స్కిల్స్, లెర్నింగ్ ఔట్‌కమ్స్ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

అరుణాచలంలో భద్రాద్రి జిల్లా యువకుడు మృతి

- గిరిప్రదక్షిణ, దర్శనానంతరం గుండెపోటు



రాకేశ్ శర్మ(ఫైల్)

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన యువకుడు తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు తెలికిచెర్ల మధుకుమార్ శర్మ కుమారుడు రాకేష్ శర్మ(33) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. ఈనెల 9న తల్లి భవానితో కలిసి అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఆదివారం అక్కడ గిరి ప్రదక్షిణ చేసి, స్వామివారి దర్శనానంతరం తిరిగి అద్దెకు తీసుకున్న రూమ్‌కు వెళ్లే క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఆనంద శ్వేత, మూడేళ్ల కూతురు, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. కుమారుడికి ఇటీవలే పాపకొల్లు ఆలయంలో అన్నప్రాసన వేడుక నిర్వహించాక, భార్య.. పిల్లలను తీసుకుని పుట్టింటికి కాకినాడ వెళ్లింది. రాకేశ్ తల్లితో కలిసి దైవ దర్శనానికి వెళ్లగా, అక్కడే తుదిశ్వాస విడిచాడు. కుమారుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు మధుకుమార్ శర్మ అరుణాచలం బయలుదేరారు. సోమవారం సాయంత్రానికి జూలూరుపాడు చేరుకోనున్నారు. కాగా, మాతృ దినోత్సవం రోజునే పుత్రుడికి కోల్పోయిన తల్లి భవానీ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అతడి మృతితో జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

భార్య మరణాన్ని తట్టుకోలేని భర్త..

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లూరి చిన్న వెంకటరత్నమ్మ (75) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేక మనోవేదనకు గురైన ఆమె భర్త తాళ్లూరి సత్యమయ్య (85) ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల వ్యవధిలోనే వృద్ధ దంపతులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో ఈ నెల 3న పురుగు మందు తాగి మృతిచెందిన ఓ వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ వెంకటగిరికి చెందిన ప్రభాకర్ మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 2న పాత బస్టాండ్ సమీపాన పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే మృతుడి చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో చూసిన కుటుంబసభ్యులు ఆదివారం గుర్తించి పోలీసులను ఆశ్రయించగా.. కొడుకు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎఫ్‌సెట్ ఫలితాల్లో ప్రైవేట్ హవా..

తెలంగాణ ప్రభుత్వం అగ్రికల్చర్, ఇంజనీరింగ్ విభాగాల్లో ఆదివారం విడుదల చేసిన ఎఫ్‌సెట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ కనబర్చినట్లు ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈమేరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

'శ్రీచైతన్య' ప్రభంజనం..



ప్రతిభ చాటిన విద్యార్థులతో చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో ప్రభంజనం సృష్టించిన తమ విద్యార్థులు వి.కుషాల్ 28వ ర్యాంక్, వై.నిషాంత్ 61, డి.దుర్గాగుజిరి 222, ఎ.సాయితేజ 253, కె.విశావని వాగ్దేవి 301, బి.రిషిత 321, ఆర్.జోష్టవ్‌కుమార్ 334, కె.సాయిదివ్య వర్షిత 423, జి.సాయి ప్రణవి 491, కె.హాసిని 575, వి.ప్రణతి, కె.తేజస్విని 653, బి.ఈశ్వర్ గుప్తా 855, యు.వశిష్ట 908, బి.మనీశేషు 968, డి.శ్రీలేఖ 1195, పి.స్మైలిక రెడ్డి 1262, కె.నిషాంత్ రెడ్డి 1394, ఎల్.మనోహర్ 1422, జి.అలేఖ్య 1482వ ర్యాంక్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్ మాదూర్, ఎగ్జిక్యూటివ్ డీన్ ఎస్ఆర్ఎస్‌డీ వర్మ, డీఎస్ జె.కృష్ణ, ఏజీఎంలు సీహెచ్.బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్' ప్రతిభ..



విజయసంకేతం చూపుతున్న ఎస్ఆర్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ చాటిన తమ విద్యార్థులు సాయికిరణ్ 200వ ర్యాంక్, తేజస్విని 669, హర్షవర్ధన్‌రెడ్డి 676, నిఖిత 1208, తిరుమలచారి 1409, గాంధీ 1767, వినోద్ 1863, ఉమేష్ చంద్ర 1892, రవితేజ 2071, ఆకాష్ 2627, శ్రీ భవన్ 2759, శివ సాయి 3707, శశాంక్ 4621, నిహాస్ 4926, చందన 5003, నందిని 5076, తేజశ్రీ 5134, మణికంఠ రెడ్డి 5812, ధనుష్‌కుమార్ 7649, హర్షవర్ధన్ 7720, అభిలాష్ 8084, లోకేష్ 8754, దీప్తిశ్రీ 9356, కార్తీక్‌రెడ్డి 9436, యశ్వంత్ 9528, హేమంత్ 9694 ర్యాంకులు సాధించారన్నారు. డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ విజయభాస్కర్ రెడ్డి, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు అశోక్, శ్రీనివాస్, సుధాకర్, బ్రహ్మం పాల్గొన్నారు.

'రెజొనెన్స్' విజయభేరి..



విద్యార్థులను అభినందిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

ఖమ్మం సహకారనగర్: రెజొనెన్స్ కళాశాలల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. విజయభేరి మోగించిన తమ విద్యార్థులు ఎ.జాహ్నవి 961వ ర్యాంక్, పి.బింధు 1364, బి.హాన్సిక 1842, కె.జశ్వంత్ 2135, ఎం.సుమంత్ 2615, ఎ.నంద 3016, ఎం.ప్రేమ్‌సాయి 4500, డి.హాన్సిక 5005, బి.ఈశ్వర్‌వెంకట్ 5034, బి.మాధవి 5855, ఐ.మణిదీప్ 6632, బి.ప్రసాద్ 7851, బి.భగత్ 8185, డి.ఉషశ్రీ 8268, జె.స్వాతి 8328వ ర్యాంక్‌లు సాధించారన్నారు. ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

'హార్వెస్ట్' హవా..



ప్రతిభ చూపిన విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు మాట్లాడుతూ అగ్రశ్రేణి ర్యాంకులు సాధించిన తమ కళాశాల విద్యార్థులు బి.సాయిచరణ్ 77వ ర్యాంక్, బి.సిద్ధార్థ 193, ఎన్.రాఘవేంద్ర నవనీత్ 265, డి.శ్రీనివాస్ గౌతమ్‌రెడ్డి 336, ఎం.నాగయశ్వంత్ 448, ఆర్.వెంకటసాయివర్షిత్ 724, ఎన్‌సీహెచ్ యశ్వంత్ సాయి 958, జి.రాణి ఉమాఅలేఖ్య 120, టీడీవీఎస్ఎస్ నయమంజలి 161, బి.భార్గవి 202, ఎండీ అనిష ముస్కాన్ 232, సరోజ్ రాజ్ పురోహిత్ 384వ ర్యాంక్ సాధించారన్నారు.

'కృష్ణవేణి' విజయఢంకా..



విజయసంకేతం చూపిస్తున్న కృష్ణవేణి డైరెక్టర్లు, విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విజయఢంకా మోగించిన తమ విద్యార్థులు వై.గీతికాశ్రీ 297వ ర్యాంక్, పి.మణిచంద్రసాయి 558, టి.కోమలి 969, పి.సిరి మహాలక్ష్మి 974, కె.మహేష్‌బాబు 1899, బి.జ్యోత్స్న 2317, పి.భార్గవి 2387, ఎస్‌కె.అబ్దుల్ సమద్ 2548, కె.వైష్ణవి 3019, పి.యశస్వి 3182, ఎస్‌కె.ఇర్ఫాన్ 3291, ఆర్.సీతారామకృష్ణ 4828, కె.హాసిని 4890, టి.దినేష్ 4924, కె.నవ్యశ్రీ 5411, కె.భావన 5439, డి.స్వప్నిక 5524, కె.కరుణశ్రీ 5556, కె.గ్యాన మహేశ్వర్ 5722, ఎస్.సాయి సంజన 6442, ఈ.సుహాస్ 6564, ఎ.సాయినిత్విక 6611, ఎస్‌కె.బుశ్ర 7053, మహాతేజ 7353, జి.పాల్ జాషువా 7728, పి.నిఖిలేష్ 7800, జి.ద్రోణితశ్రీ 8075, జి.రక్షిత 8175, ఎల్.నాగలక్ష్మి 8360, ఎండీ సామియాసామర్ 8538, ఎస్.వివేక్ 8779, బి.రోహిత్‌గని 8945, జి.అఖిల 8979, ఎ..భరత్ 9163, టి.కృష్ణవేణి 9514, జి.ప్రవీణ 9519, సృష్టి సాహు 9563, అనుమల భరత్ 9617, కె.మౌనిక 9714, ప్రశాంత్ 9718, రోహిత్ 9843వ ర్యాంక్ సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రయ్య, అకడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'న్యూవిజన్'కు ర్యాంకులు..



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ మాట్లాడుతూ.. ర్యాంక్‌లు సాధించిన తమ విద్యార్థులు పి.సంహిత 102వ, ఎం.ఆకాంక్ష 109, ఆర్.శీతల్ 110, పి.ప్రణవ్ 168, ఆర్.షణ్ముఖ ప్రియ 171, డి.అనన్య 210, ఎ.రోషిక్ మణిదీపక్ 311, ఎం.రోహన్ శ్రీహరి 456, జి.కార్తీక్ సాయి 492, ఎం.వైష్ణవి 525, ఎస్.శ్రవంత్ 534, పి.భవిష్య 583, పి.రోహిత్ 586, మిస్‌హాజ్ ఆరా 719, కె.జశ్వంత్ రామ్ 755, ఎస్.భార్గవ్ సాయి 844, ఎస్.మనస్విక్ 1046, సీహెచ్.సాయికృష్ణ 1076, ఆర్.గుణదీప్ 1185, కె.మధురహాసిని 1230, బి.పియూష్ వర్ధన్‌రాథోడ్ 1270, ఆర్.కౌశిక్ 1340, జి.లలనిక చౌదరి 1383, డి.నర్సింహాలక్ష్మి శ్రీనివాస్ 1430, ఈ.వేదసంహిత 1461, ఎం.విశ్వక్ 1514, షేక్.అంజుమ్ 1622, డి.ప్రణీత 1751, జి.అనుప్రియ 1756, సీహెచ్.శ్రీహాస్ 1757, ఎం.చరణ్‌వెంకట్ 1840, వి.విజయకాంత్ 1849, ఐ.శ్రీహిత 1860 ర్యాంక్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గోపిచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాళ్లు బ్రహ్మచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'వెలాసిటీ' సత్తా..

ఖమ్మంసహకారనగర్: వెలాసిటీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎఫ్‌సెట్ ఫలితాల్లో సత్తాచాటిని తమ విద్యార్థులు ఎస్‌డీ ఆర్మాన్ 3426వ ర్యాంకు సాధించగా, కె.గోపినాథ్ 4031, ఎం.అభిషేక్ 5216, బి.గౌతమ్ 6410, ఎం.సృజన్ 7981, ఎం.మురళి 9035, టి.రవికిరణ్ 10123, జి.నాగరాజు 12018, బి.శ్రావణి 13288, కె.రవికుమార్ 14572, ఎం.ఆఖీబ్‌ఇషాన్ 17172,, మీర్జా అంజాద్‌బేగ్ 18177, జి.మల్లిఖార్జున్ 19236, కె.నిషా 20176 ర్యాంకులు సాధించారు. అలాగే డి. జోత్స్న 10236, ఎం. సుబ్బలక్ష్మి 15550, కె.నిర్మల 16376 ర్యాంకులతో అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.రవి, అకడమిక్ డీన్ యాకూబ్, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

ర్యాంకర్ల భవిష్యత్ ప్రణాళికలు..

సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పాలని..



ఎఫ్‌సెట్ ఫలితాల్లో నా తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం ప్రోత్సాహంతోనే రాష్ట్రస్థాయిలో 28వ ర్యాంక్ సాధించగలిగాను. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ చదివి సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాను. మాది వైరా. నాన్న మల్లిఖార్జున్‌రావు వస్త్ర వ్యాపారం చేస్తుండగా.. అమ్మ గృహిణిగా ఉన్నారు.

– వి.కుషాల్, శ్రీచైతన్య విద్యార్థిని

ఐఐటీలో చదవాలని ఉంది..



హార్వెస్ట్ కాలేజీలో చదివిన నేను ఎఫ్‌సెట్‌లో 77వ ర్యాంక్ సాధించాను. ఐఐటీలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ జాబ్ చేయాలని ఉంది. తల్లిదండ్రుల తోడ్పాటుతో పాటు పాఠశాల యాజమాన్యం సలహాలు, ప్రత్యేక శిక్షణతో ఈ విజయం సాధించగలిగాను. నాన్న అనిల్‌కుమార్ కిరాణ షాపు వ్యాపారి, తల్లి కల్యాణి గ్రహిణిగా ఉన్నారు.

– సాయిచరణ్, హార్వెస్ట్ విద్యార్థి

ఉన్నత ఆశయాలు లక్ష్యం..



ఎఫ్‌సెట్ ఫలితాల్లో 108వ ర్యాంకు సాధించినందుకు ఆనందంగా ఉంది. ఉన్నత ఆశయాలను అధికమించాలని లక్ష్యంగా నిర్ణయించుకుని ముందుకు సాగుతా. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహంతోనే ఈ విజయాన్ని సాధించగలిగాను. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండగా, తల్లి సబిత గృహిణిగా ఉన్నారు.

– పి.ప్రణవ్, న్యూవిజన్ విద్యార్థి

ప్రజలకు సేవ చేయాలని..



వైద్యవృత్తిలో స్థిరపడి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాను. నాకు ఎఫ్‌సెట్‌లో 222వ ర్యాంక్ వచ్చింది. తండ్రి శరత్‌కుమార్ వ్యాపారం చేస్తుండగా.. తల్లి నీలిమ గృహిణిగా ఉన్నారు. భవిష్యత్‌లో కార్డియాలజీ లేదా న్యూరో సర్జన్‌గా చదువుకుని ఉన్నత స్థానాల్లో పేద ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాను.

– దుర్గా గుజిరి, శ్రీచైతన్య విద్యార్థిని

'ఉద్దీపకం'తో సత్ఫలితాలు

- గతేడాది 3,4,5 తరగతుల విద్యార్థులకు పంపిణీ
- రానున్న ఏడాది 1, 2వ తరగతుల్లో అమలుకు ప్రణాళికలు
- ప్రాథమిక విద్య పటిష్టతపై పీఓ దృష్టి



గిరిజన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)


భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ప్రాథమిక విద్య పటిష్టతకు పీఓ చేపట్టిన ప్రయోగం ఫలించింది. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గిరిజన విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దీపకం అభ్యాసన పుస్తకాలు అందించారు. మెరుగైన ఫలితాలు కనిపించడంతో ఈయేడాది మిగతా తరగతులకు కూడా అందించాలని భావిస్తున్నారు.

విద్యార్థుల్లో వెనుకబాటును గుర్తించి..

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై అవగాహన ఉన్న బి.రాహుల్ ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టాక ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించారు. గిరిజన విద్యార్థులతో మమేకమై వారి ప్రతిభా పాటవాలను పరిశీలించారు. ప్రాథమిక విద్యలో వారి వెనుకబాటుతనాన్ని గుర్తించారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం లేకపోవడంతో ప్రాథమిక విద్య పటిష్టతకు చర్యలు చేపట్టారు.

పునాది బలపడేలా 'ఉద్దీపకం'

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల సామర్థ్యాలు బలంగా ఉండేందుకు ఉద్దీపకం పేరిట ప్రత్యేక అభ్యాసన పుస్తకాలను తీసుకొచ్చారు. ఇందుకోసం పీఎంఆర్‌సీ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక పుస్తకాలను సిద్ధం చేయించారు. తొలి విడతగా 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. గణితంలో కూడిక, తీసివేత, భాగహారం, హెచ్చివేతల ఆవశ్యకత, వాటిని సులువుగా వినియోగించటం, లెక్కల ప్రశ్నలను సులువుగా సాధించడం, ఉన్నత విద్యకు ప్రాథమిక స్థాయిలో గణితం పునాది, నిత్య జీవితంలో లెక్కలను వినియోగించడం వంటి అంశాలపై వర్క్‌షీట్లతో బుక్‌లను సిద్ధం చేయించారు. ఇంగ్లిష్‌లో గ్రామర్‌పై పట్టు, సులువుగా వాక్యాల కూర్పు, పద వినియోగం పెంపు, రీడింగ్ అండ్ రైటింగ్ స్కిల్స్ పెంచే విధంగా రూపొందించారు. ఇంగ్లిష్ నిర్భయంగా మాట్లాడేలా అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని ఈ వర్క్‌షీట్లలో పొందుపర్చారు.



ఇంగ్లిష్ వర్క్‌బుక్

సత్ఫలితాలతో 1,2 తరగతులకు అమలు

2024లో పాఠశాలల ప్రారంభం సమయానికి వర్క్‌బుక్‌లను సిద్ధం చేయించి 3,4,5 తరగతుల విద్యార్థులకు అందించారు. ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తూ బోధనా తీరును పర్యవేక్షించారు. ఉద్దీపక పుస్తకాలతో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది 1, 2వ తరగతులకు కూడా ఉద్దీపనం పుస్తకాలు ఇవ్వాలని భావిస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి వర్క్‌షీట్లు సిద్ధం చేయాలని సూచించారు. తుది పరిశీలన అనంతరం ఆమోదించి పుస్తకాల రూపంలోకి తీసుకురానున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి పాఠశాలల పునః ప్రారంభం సమయంలోనే పుస్తకాలు అందించాలనే కృతనిశ్చయంతో ఐటీడీఏ అధికారులు దృష్టి సారించారు.

ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూం ప్రారంభం



ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్: కరీంనగర్ నగరంలోని విట్స్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బుల్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్విప్‌మెంట్ ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి.సోమసుందరం, స్టేట్‌హెడ్ ఎన్.సురేశ్ బాబు, షోరూం డీలర్ అంబటి జోజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. బుల్ కంపెనీకి సంబంధించి ఒక స్టాండర్డ్ పోర్ట్, స్టాండర్డ్ క్వాలిటీ, మంచి పెర్ఫార్మెన్స్ ఉంటుందన్నారు. బుల్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా గంటకు లీటర్ డీజిల్ ఆదా చేయడం జరుగుతుందన్నారు. సర్వీస్ విషయంలోనూ 100శాతం క్వాలిటీ అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, ఫాదర్ సంతోష్ పాల్గొన్నారు.

వృద్ధులపైకి దూసుకెళ్లిన కారు..

సత్తుపల్లిరూరల్: ఇంటి ముందు కూర్చున్న వృద్ధులపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి మండలం లింగగూడెంకు చెందిన నవ వధువులు భద్రాద్రి రాములోరిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బుగ్గపాడులో ఇంటి ముందు కూర్చున్న తాటి వీరమ్మ, గద్దం చిన్నప్ప వృద్ధులను కారు అదుపు తప్పి ఢీ కొట్టింది. ఇరువురికి తీవ్ర గాయాలు కాగా వారిని 108లో సత్తుపల్లికి తరలించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మధిర: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మాటూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మాసుకొండ తిరుపతమ్మ (30) సుమారు పదేళ్ల క్రితం ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ శ్రీనివాసరావును కులాంతర వివాహం చేసుకుంది. వారికి ఒక కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం తిరుపతమ్మ పుట్టింటికి వెళ్లగా.. పెద్ద మనుషుల సమక్షంలో ఆదివారం మాట్లాడుకునేందుకు భర్త, ఆయన తరపు బంధువులు వస్తున్నారే విషయం తెలుసుకున్న ఆమె మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



వేమూరి వెంకన్న(ఫైల్)

కారేపల్లి: కారేపల్లి భారత్‌నగర్ కాలనీకి చెందిన వేమూరి వెంకన్న(53) వడదెబ్బతో మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ఆదివారం ఎండ తీవ్రత తట్టుకోలేక వడదెబ్బతో మృత్యువాత పడ్డాడు. కాగా, మృతుడు సింగరేణి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఐదు పశువులు..

ముదిగొండ: ఖమ్మం–కోదాడ జాతీయ రహదారిపై ముదిగొండ, వెంకటాపురం గ్రామాల సమీపాన గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఆదివారం నాలుగు గేదెలు, ఒక దూడ మృతి చెందగా.. మరో గేదెకు గాయాలయ్యాయి. ఇవి ముదిగొండ, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు వినోద్‌బాబు, ఉపేందర్‌కు చెందిన గేదెలు కాగా గాయపడిన గేదెకు స్థానిక పశువైద్యసిబ్బంది వైద్య చికిత్స నిర్వహించారు.

నల్లచట్టాలతో రైతులకు నష్టం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

కొణిజర్ల : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాలతో రైతులు నష్టపోతున్నారని, వీటిని నిరసనగా రైతులతో పాటు కార్మికులు కూడా ఉద్యమిస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఇటీవల భారత్ – పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని కమ్యూనిస్టులు సూచిస్తే దేశ ద్రోహులుగా చిత్రకరించేందుకు కొందరు ప్రయత్నించారని ఆరోపించారు. మండలంలోని లాలాపురంలో సీపీఎం నాయకుడు సంక్రాంతి మధుసూదనరావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించగా రాఘవులు మాట్లాడారు. యుద్ధంతో తీవ్ర నష్టాలు ఉంటాయని, రెండు దేశాల మధ్య సయోధ్యతో యుద్ధాన్ని నివారించొచ్చని కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని పార్టీలన్నీ చెప్పాయన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్ ఉండదనే చర్చ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెబుతున్న ముఖ్యమంత్రి రూ.వేలకోట్లు ఖర్చు పెట్టి అందాల పోటీలు నిర్వహించడం అవసరమా అని ప్రశ్నించారు. నాగర్ కర్నూల్ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ తాను కాంగ్రెస్ వాదినైనా మధుసూదనరావు ఆలోచనా విధానాన్ని అవలంబించేవాడినని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, సాయిబాబా, నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవులు, పక్కన మల్లు రవి, తమ్మినేని తదితరులు